
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
శుక్రవారం 16 మే 2025







# రైతుబజార్‌కు పూర్వ వైభవం



వైసీపీ హయాంలో కుంటుపడిన అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలోనే రైతు బజార్ల నిర్వహణలో మూడోస్థానంలో ఉన్న సి.క్యాంపు రైతుబజార్ ఉంది. 'స్వచ్ఛాంద-స్వర్ణాంధ్ర'లో భాగంగా కర్నూలు సి.క్యాంపు రైతుబజార్‌ను పర్యటించేందుకు సీఎం సిద్ధమయ్యారు. రైతుబజారులో సీఎం చంద్రబాబు చేసే తనిఖీలను అంచనావేసి పూర్తి స్థాయిలో ఈకార్యక్రమం విజయవంతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతుబజారు, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు. రోడ్ల వెడల్పు, డ్రైనేజీల మరమ్మతులు, మరుగుదొడ్ల పరిశుభ్రత వంటి పనులు చేపడుతున్నారు. సీఎం రాక సందర్భంగా నగరానికి కొత్త శోభ సంతరించుకుంది. రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. డివైడర్లకు రంగులు వేస్తున్నారు.

- చురుగ్గా అభివృద్ధి పనులు
- రోడ్డు వెడల్పునకు శ్రీకారం
- డ్రైనేజీలకు మరమ్మతులు
- పర్యవేక్షిస్తున్న అధికారులు
- రైతులు చెప్పే సమాధానాలపై కసరత్తు
- రైతుబజార్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ లభించేనా?

**కర్నూలు అగ్రికల్చర్, మే 15 (ఆంధ్రజ్యోతి):** సి .క్యాంపు రైతుబజారుకు పూర్వవైభవం రానుంది. 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సీ.క్యాంపు రైతుబజారులో పర్యటించనున్నారు. రైతుబజారును సుందరంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు జేసీ నవ్య రైతుబజారుతో పాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. రాష్ట్రంలోనే రైతు బజార్ల నిర్వహణలో మూడోస్థానంలో ఉన్న సీ.క్యాంపు రైతుబజార్ ఉంది. ఏవిధంగా ఆస్థాయికి చేరిందో ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని సీఎం తెలుసుకొని ఈ రైతుబజారును ఏవిధంగా అభివృద్ధి చేశారో, ఎంతమంది రైతులు ఏయే గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి కూరగాయలు అమ్ముకుంటున్నారో ఎంత మంది వినియోగదారులు ప్రతిరోజు ఇక్కడకు వచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తున్నారో స్వయంగా పరిశీలించనున్నారు.



సి.క్యాంపు రైతుబజార్ వద్ద పనులను పరిశీలిస్తున్న జేసీ నవ్య

య ఆహారోత్పత్తులను విక్రయిస్తున్న సూర్యప్రకాష్ రెడ్డి ఏ విధంగా ఈస్థాయికి చేరాడో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ ఉన్నతాధికారులు పూర్తి చేశారు. చిన్నటేకూరు చెందిన పరమేష్ సేంద్రీయ ఎరువులతో కూరగాయలను సాగు చేస్తూ పండిస్తున్నారు. ఈ రైతుబజారులోనే తాను పండించిన కూరగాయలను ప్రజలకు విక్రయిస్తూ మంచి లాభం పొందుతున్నాడు. పాండురంగడు అనే రైతు ఉల్లితో పాటు ఆకుకూరలను తనకున్న రెండెకరాల పొలంలో సాగు చేసి తక్కువ ధరకే వినియోగదారులకు విక్రయిస్తూ గుర్తింపు పొందాడు. ఈ ముగ్గురు రైతులు ప్రజలకు ఆరోగ్యకరమైన కూరగాయలను చౌకగా ఎలా అందిస్తున్నారో సీఎం స్వయంగా పరిశీలించనున్నారు.

## ముగ్గురు రైతుల ఎంపిక

రైతుబజార్ లక్ష్యం నెరవేరేందుకు అధికారులు చేస్తున్న కృషిని ప్రత్యక్షంగా పరిశీలించిన ముగ్గురు ఆదర్శ రైతులను మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి క్రిష్ణగిరి మండలం అమకతాడులో తనకున్న పొలం లో పూర్తిస్థాయిలో సేంద్రీయ ఎరువులతోనే వివిధ రకాల పంటలను పండిస్తూ సీ.క్యాంపు రైతుబజారులో ఉన్నతాధికారుల సహకారంతో స్టాల్‌ను ఏర్పాటుచేసి సేంద్రీ



## పనుల పర్యవేక్షణ

సి.క్యాంపు రైతుబజారులో సీఎం చంద్రబాబు చేసే తనిఖీలను అంచనావేసి పూర్తి స్థాయిలో ఈకార్యక్రమం విజయవంతం చేసేందుకు రైతుబజార్ రాష్ట్ర సీఈవో మాధవీలత, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీతతో పాటు కడప జేడీ రామాంజనేయులు రైతుబజారులో చేపట్టాల్సిన, జరుగుతున్న పనులను జేసీ నవ్య గురువారం పర్యవేక్షించారు. పనులను ప్రత్యక్షంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఎం తనిఖీలు చేసేందుకు ఎటువంటి ఆటంకాలు, ట్రాఫిక్ రద్దీ లేకుండా రైతుబజారు ముందు ఉన్న రోడ్డును వెడల్పు చేశారు. రైతుబజారులో కాలువలను మరమ్మతులు చేశారు. మరుగుదొడ్లు శుభ్రం చేయించారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మతో పాటు హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులను అప్రమత్తం చేశారు. రైతులతో సీఎం చంద్రబాబు ఏమి మాట్లాడుతారో.. ఆయన అడిగే ప్రశ్నలకు రైతులు చెప్పాల్సిన సమాధానాలపై మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేశారు.



## వైసీపీ హయాంలో..


ప్రతిరోజు కూరగాయలు కొనుగోలు చేసేందుకు స్థానిక ప్రజలు ఆరు, ఏడు వేల మంది దాకా ఈ రైతుబజారుకు వస్తున్నారు. నడవడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. ఈ పరిస్థితుల నుంచి రైతుబ జారును గట్టెక్కించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో ప్రతిపాదనలను పంపినా అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. రైతుబజారును అనుకుని ఉన్న శిథిలావస్థకు చేరిన పది రెవెన్యూ క్వార్టర్స్‌ను రైతుబజారుకు అప్పగించి విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని దాదాపు రూ.4 కోట్లతో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు చేశారు. నిధులు కూడా మంజూర య్యాయి. వైసీపీ ప్రభుత్వం రాకతో ఆనిధులు వెనక్కు వెళ్లాయి. మళ్లీ ప్రస్తుతం ఈ రెవెన్యూ క్వార్టర్స్‌ను కూలగొట్టి అక్కడ సీ.క్యాంపు రైతుబజారును విస్తరించేందుకు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీతకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. సీఎం చంద్ర బాబునాయుడు తన పర్యటనలో సీ.క్యాం పు రైతుబజారు విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకా శముందని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

## నగరానికి కొత్త శోభ


సి.క్యాంపు సెంటర్‌లో రంగులు వేస్తున్న కార్మికుడు

**కర్నూలు న్యూసిటీ, మే 15(ఆంధ్రజ్యోతి):** సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో నగరానికి కొత్త శోభ రానుంది. ఈనెల 17వ తేదీన సీఎం నగరానికి వస్తున్న సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల పనులు చేపట్టారు. దీంతో నగరమంతా కళకళలాడుతోంది. ప్రధానంగా నంద్యాల చెక్‌పోస్టు నుంచి సీ.క్యాంపు సెంటర్ వరకు ప్రధాన రహదారులకు ఇరువైపులా పుట్‌పాత్ గోడలకు రంగులు వేస్తున్నారు. గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. ఎండిపోయిన మొక్క ల స్థానంలో కొత్త మొక్కలను నాటుతున్నారు. డివైడర్లలో కొత్త మొక్కలు నాటడంతో పచ్చదనంతో కళకళలాడుతోంది. సీ.క్యాంపు కూడలి నుంచి కలెక్టరేట్ వరకు డివైడర్లకు కూడా రంగులు వేస్తున్నారు.


సి.క్యాంపు రైతుబజారు వద్ద కొనసాగుతున్న పనులు


సి.క్యాంపు రైతుబజారు వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం


చెత్త తరలింపు దృశ్యం

# పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టండి

- ప్రతి షాపు వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలి
- పనులు త్వరగా పూర్తి చేయాలి
- పార్కు సుందరీకరణ వివరాల ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలి
- సీఎం పర్యటన ఏర్పాట్లను ఎస్పీతో కలిసి పరిశీలించిన కలెక్టర్


సి.క్యాంపు రైతుబజారు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**కర్నూలు అగ్రికల్చర్, మే 15 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 17వ తేదీన సీ.క్యాంపు రైతుబజారులో పర్యటిస్తున్నారని, ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని వివిధ విభాగాల అధికారులను కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. సీఎం పర్యటన సందర్భంగా రైతుబజారులో చేపట్టిన కార్యక్రమాలు, ప్రజా వేదికకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను ఎస్పీతో కలిసి కలెక్టర్ గురువారం సాయంత్రం పరిశీలించారు. ప్రతి షాపు వద్ద డస్టుబిన్‌లను ఏర్పాటు చేయాలని, వాటికి నెంబర్లు వేయాలని అధికారులను ఆదేశించారు. రైతుబజారు షెడ్డుపైన ఎండ వేడిమి లేకుండా గ్రీన్‌షెడ్డు ఏర్పాటు చేయాలన్నారు. సమయం ఎక్కువగా లేనందున పనులు త్వరగా చేయాలని ఎప్పటికప్పుడు పనులు ఎంతవరకు పూర్తయ్యాయో తనకు సమాచారం అందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. రైతుబజారు లోపల, బయట పరిసరాలు, టాయిలెట్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం ధనలక్ష్మి నగర్‌లో స్వచ్ఛాంధ్ర పార్కుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న సందర్భంగా అక్కడ కోడ్ ఏర్పాట్లను పరిశీలించారు. పార్కులో ప్లాంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలని అటవీ శాఖ అధికారిని ఆదేశించారు. ఈ పార్కులో సుందరీకరణ వివరాలను తెలియజేసే విధంగా ఫ్లెక్సీని రూపొందించాలన్నారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ప్రజావేధిక ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు, పార్కింగ్, వేదిక తదితర ఏర్పాట్లపై ఎస్పీ విక్రాంత్ పాటిల్, రైతుబజార్ స్టేట్ సీఈవో మాధవీలత, మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత, జేసీ నవ్య, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కర్నూలు ఆర్డీవో సందీప్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పరిశీలించారు. అంతకుముందు సీఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా ఎస్పీతో కలిసి కలెక్టర్ ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును పరిశీలించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని డైరెక్టర్‌ను ఆదేశించారు.

# రేపు కర్నూలుకు సీఎం చంద్రబాబు



**కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను ఉన్నతాధికారులు ఖరారు చేశారు. శనివారం సీఎం కర్నూలులో పర్యటించనున్నారు.

**పర్యటన ఇలా:**

- ఉదయం 10:45 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 11:25 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడే ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతారు.
- ఉదయం 11:55 గంటలకు సి.క్యాంపు రైతుబజారును సందర్శిస్తారు. సుమారు అరగంట సేపు రైతులతో, శానిటరీ వర్కర్లతో ముఖాముఖి మాట్లాడుతారు.
- 12.30 గంటలకు కేంద్రీయ విద్యాలయం సమీపం వంద అడుగుల రోడ్డులో ఉన్న పార్కులో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర పార్కును ఏర్పాటు కోసం భూమి పూజ చేస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్దకు వస్తారు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి 3:30 గంటల వరకు ప్రజలతో ముఖాముఖి చర్చిస్తారు. 3:30 గంటల నుంచి 5:05 గంటల వరకు పార్టీ నాయకులతో సమావేశం ఉంటుంది. అలాగే 5:20 గంటలకు ప్రజా వేదిక నుంచి కర్నూలు ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్తారు.

# రమణీయం.. రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకీ ఉత్సవం


స్వర్ణ పల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రస్వామి

**మంత్రాలయం, మే 15(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. శ్రీమఠంలో రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం వైశాఖ తదియ శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి రమణీయంగా ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు మంగళవాయిద్యాలు మధ్య శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ఊరేగుతున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఊంజలసేవ చేసి హారతులు ఇచ్చారు. పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామికి విశేషపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న మఠం ప్రాంగణం


టీజీవీ కళాక్షేత్రంలో నృత్యం చేస్తున్న కళాకారిణి

జిల్లాకు 14,053.50 క్వింటాళ్ల

# రాయితీ విత్తనాలు

**వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి**

**కర్నూలు అగ్రికల్చర్, మే 15 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు జిల్లాలో జూన్‌లో మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వివిధ పంటలకు అవసరమైన రాయితీ విత్తనాలను 14,053.50 క్వింటాళ్లను ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. వేరుశనగ కే-6 రకం 11,980 క్వింటాళ్లు, టీసీజీఎస్ 1694 రకం వేరుశనగ విత్తనాలు 1250 క్వింటాళ్లు, కే-లేపాక్షి రకం విత్తనాలు 570 క్వింటాళ్లు మొత్తం 13,800 క్వింటాళ్లు కేటాయించిందని తెలిపారు. త్వరలోనే వీటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామనీ గురువారం జేడీ తెలిపారు. కందులు ఎల్ఆర్‌జీ-41 రకం విత్తనాలు 97.50 క్వింటాళ్లు, ఐసీపీఎల్ రకం విత్తనాలు 197.50 క్వింటాళ్లు, పీఆర్‌జీ రకం విత్తనాలు 597.50 క్వింటాళ్లను రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. పెసలు పి-4 రకం విత్తనాలను 24 క్వింటాళ్లు, మినుములు ఎల్‌జీజీ-410 రకం విత్తనాలు 2 క్వింటాళ్లు, కొర్ర ఎస్ఐఏ రకం విత్తనాలు 25 క్వింటాళ్లు, శ్రీలక్ష్మి రకం విత్తనాలు 45 క్వింటాళ్లు మొత్తం 70 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దయంచ లోకల్ 154 క్వింటాళ్లు, పిల్లిపెసర 11 క్వింటాళ్లు రాయితీపై పంపిణీ చేస్తామని చెప్పారు.

## పత్తి గరిష్ఠ ధర క్వింటం రూ.7,881


విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడి

**ఆదోని అగ్రికల్చర్, మే 15(ఆంధ్రజ్యోతి):** ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గురువారం పత్తి ధర క్వింటం గరిష్ఠంగా రూ.7881 కు వ్యాపారులు కొనుగోలు చేశారు. గతవారంతో పోల్చితే క్వింటానికి రూ.200 పైగా ధర తగ్గింది. సీజన్ ముగియడంతో పత్తి దిగుబడిలో నాణ్యత లేకపోవడంతోనే ధరలు తగ్గడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. 2725 క్వీటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ. 4189, మధ్యస్థ ధర రూ.7,529 పలికింది.

భారత సైన్యానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు
రచయిత, నటుడు శంకర్ రాజు 6

కేంద్ర నియంత్రణలోకి 'ఉపాధి' 7

# డెంగీతో తస్మాత్ జాగ్రత్త



- ఆడ ఏడిస్ దోమ కాటుతో వాప్తి
- పరిసరాల్లో నీటి నిల్వలేకుండా చూడాలి
- సరైన అవగాహన లేకపోవడమే కారణం
- సకాలంలో చికిత్సతో నివారణ సాధ్యం
- ఏటేటా పెరుగుతున్న కేసులు
- నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం



కర్నూలు హాస్పిటల్, మే 15 (ఆంధ్రజ్యోతి): డెంగీ చాలా వరకు మామూలు జ్వరమే. అయినా కొందరిలో ఇది ప్రాణాంతకంగా పరిణమిస్తోంది. సరైన అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. సకాలంలో చికిత్స తీసుకుంటే ఈవ్యాధిని చాలా వరకు నివారించొచ్చు. డెంగీ వ్యాధిని నియంత్రించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మే 16వ తేదీన జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'మూడు పద్ధతులను పాటించండి.. డెంగీను ఓడించండి' అన్న నినాదాన్ని ప్రభుత్వం ఇచ్చింది.

### వ్యాధి లక్షణాలు

డెంగీ తీవ్రమైన జ్వరంతో మొదలవుతుంది. కండ్లు కదిలించలేని పరిస్థితి. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు వస్తాయి. అధిక దాహం, నోరు ఎండిపోవడం. ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి.

**వ్యాప్తి:** ఈ వైరస్ ఆడ ఏడిస్ రకం దోమకాటు ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు ఇండ్లలోని నీటి నిల్వల్లో పెరుగుతాయి. వైరస్ దోమలు పగటిపూట కుడుతాయి. ఈ దోమలు 400 మీటర్లు ఎక్కువ దూరం ఎగరలేవు.


### చికిత్స



వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధికి పూర్తిచికిత్స లేదు. లక్షణాలు బట్టి వైద్యులచే ఉపశమన చర్యలు చేపట్టాలి. వ్యాధి తీవ్రంగా ఉన్నట్లయితే ప్రభుత్వ సర్వజన, జిల్లా ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. పూర్తిగా కోలుకునే వరకు వైద్యుడి పర్యవేక్షణలో ఉండాలి. రక్త నమూనాలను పరీక్షించే వ్యాధి నివారణ ఏలిసా టెస్టు ద్వారా చేయించాలి.

### నివారణ చర్యలు

ఇంటి లోపల, ఆవరణంలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. ఇంటిలో నీరు నిల్వ ఉన్న పాత్రలపై మూతలు పెట్టాలి. వారానికి ఒక్కసారి ప్రతి శుక్రవారం డ్రైడే - ఫ్రైడే పాటించాలి. ఆరోజు పాత్రలోని నీరు ఉన్నా పారదోసి, పాత్రలను శుభ్రంగా తుడిచిపెట్టుకోవాలి. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలి.తాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాలు, పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో ఉంచకుండా చూడాలి.



### జిల్లాలో 104 డెంగీ కేసులు

జిల్లాలో డెంగీ కేసులు ఏటేటా పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి మే 15వ తేదీ వరకు 105 డెంగీ పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. జిల్లా వ్యాప్తంగా 882 మంది అనుమానితులకు డెంగీ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇందులో ఆదోని, కర్నూలు జీజీహెచ్ మైక్రోబయాలజీ విభాగంలో ఏలిసా టెస్టులు 519 మంది నిర్వహించగా ఇందులో 104 మందికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది.

### కర్నూలు మున్సిపాలిటీలో అత్యధికంగా..

కర్నూలు నగరంలో అత్యధికంగా 16 డెంగీ కేసులు వెలుగు చూశాయి. ఇందులో శ్రీరాంనగర్‌లో 4, వడ్డేగేరిలో 3, శరీన్‌నగర్‌లో 3 కేసులు బయటపడ్డాయి. ఇక గూడూరు మున్సిపాలిటీలో హరిజనవాడలో 3, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 4 కేసులు. సి.బెళగల్ మండలంలోని పోలకల్ పీహెచ్‌సీలో అత్యధికంగా ఏడు డెంగీ కేసులు నమోదయ్యాయి. డి.బెళగల్ పీహెచ్‌సీలో 6 కేసులు వచ్చాయి. కల్లూరు, డైవందిన్నె, నన్నూరు, హాలహర్వి (ఎన్), లద్దగిరిలో ఒక్కొక్క పీహెచ్‌సీ ఐదేసీ కేసులు నమోదు అయ్యాయి. గూడూరు మండలంలోని చనుగొండ్లలో 4, కర్నూలు మండలంలోని ఉల్చాలో 2, రేమటలో 2, ఓర్వకల్లు మండలం లొద్దిపల్లెలో 2 కేసులు వచ్చాయి.

### అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం



జాతీయ డెంగీ నివారణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం అన్నీ పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో అంగన్‌వాడీ సెంటర్లు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ మేరకు డెంగీ వ్యాధికి సంబంధించి ఐఈసీ కరపత్రాలను పంపిణీ చేశాం. డెంగీ పాజిటివ్ వచ్చిన ఇంటితో పాటు చుట్టుపక్కన ఉన్న 50 ఇళ్లను ఫైరీథ్రం స్ప్రే చేస్తాం.

- డా.పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

### దోమలు కుట్టకుండా చూసుకుంటే..



దోమలు కుట్టకుండా చూసుకుంటే డెంగీని పూర్తిగా నివారించొచ్చు. జిల్లాలో ఆదోని, కర్నూలు జీజీహెచ్‌లలో డెంగీ ఏలిసా టెస్టులు అందుబాటులో ఉన్నాయి. డెంగీ పాజిటివ్‌ను ఏలిసా టెస్టు ద్వారానే నిరారిస్తారు. ఒక గ్రామాల్లోని ఎంఎల్‌హెచ్‌పీలకు డెంగీ కిట్లను కూడా ఇచ్చాం. గ్రామాల్లో డెంగీ పాజిటివ్‌గా వస్తే అయితే కేసును మళ్లీ ఏలిసా టెస్టు చేయించి నిర్ధారణ చేస్తాం. ఈఏడాది 519 ఏలిసా టెస్టులను కర్నూలు, ఆదోనిలోని మైక్రోబయాలజీ విభాగంలో చేయించాలి.

- ఎ.నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

### ప్లేట్‌లెట్లు అందిరికీ అవసరం లేదు



డెంగీ జ్వరంలో అందరికీ ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం లేదు. ప్లేట్‌లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి. ప్లేట్‌లెట్లు 50వేల కన్నా పడిపోతే ఆసుపత్రిలో చేర్చాలి. వీరిని నిశితంగా పరిశీలిస్తుండాలి. ఒకవేళ ప్లేట్‌లెట్లు 20వేల కన్నా తగ్గి, రక్తస్రావ లక్షణాలు కనిపిస్తుంటే బయటి నుంచి ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి వస్తుంది. అదే 10వేలకు పడిపోతే రక్తస్రావం ఉన్నా లేకున్నా ప్లేట్‌లెట్లు ఎక్కించాలి.

- డా.పి.రవికళాధర్ రెడ్డి, సీనియర్ ఫిజీషియన్, కర్నూలు

### పరిస్థితిని బట్టి చికిత్స



ఒక మాదిరి డెంగీ జ్వరానికి పారాసిటమాల్ మాత్రలు ఇస్తే సరిపోతుంది. వాంతులు లేకపోతే ఓఆర్ఎస్ఎస్ ద్రావణం తాగించాలి. వాంతులు అవుతుంటే వాటిని తగ్గించే మందులతో పాటు ఓఆర్ఎస్ ఇవ్వాలి. ముఖ్యంగా పిల్లలను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించాలి.

- డా. వినీషా రెడ్డి, సీనియర్ ఫిజీషియన్, వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కర్నూలు

## మాకు రాజకీయ గురువు ఎన్టీఆర్

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- మంత్రి ఫరూక్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



కేక్ కట్ చేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): నాకు, ఫరూక్‌కు రాజకీయ గురువు ఎన్టీఆర్ అని శాసనసభ స్పీకర్ అయన్నపాత్రుడు అన్నారు. గురువారం నంద్యాలలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ఆయన పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఇందులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ బైరెడ్డి శబరి, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి పాల్గొని కేక్ కోసి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం రాజ్ టాకీస్ వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్పీకర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశీస్సులతో చిన్న వయస్సులోనే మంత్రి పదవులు చేశామన్నారు. పుట్టిన రోజు ఉందని తెలుసుకుని ఒక రోజు ముందుగానే ఇక్కడికి వచ్చామన్నారు. ఆయనకు మంచి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ వయస్సులో కూడా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడం విశేషం అన్నారు. అనంతరం కార్యకర్తలతో పలు సమస్యలపై చర్చించారు. నంద్యాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట

- జిల్లాకు 3,047 క్వింటాళ్ల జీలుగ, పిల్లిపెసర, జనము విత్తనాలు మంజూరు
- 50 శాతం రాయితీతో పంపిణీ
- నేటి నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రారంభం



నంద్యాల ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పంటకు సరైన పోషకాలు లభ్యమైనప్పుడే దిగుబడులు పెరుగుతాయి. అధిక దిగుబడులు పొందాలన్న ఆతృతతో రైతులు పంటలసాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువులను వాడడంతో భూసారం దెబ్బతినడమే కాకుండా ఆహార పంటలు కలుషితం అవుతున్నాయి. క్రమంగా పంటల్లో సూక్ష్మ, స్థూల పోషకాలు లోపిస్తున్నాయి. అంతేకాకుండా చీడపీడల ఉధృతి పెరగడంతో రైతులకు పెట్టుబడుల భారం కూడా పెరుగుతోంది. వీటన్నింటినీ అధిగమించాలంటే మనకున్న అన్ని వనరుల్లో తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో భూమి సారం పెంపొందించడానికి తద్వారా పంటల ఉత్పాదకత సాధించడానికి పచ్చిరొట్ట పంటలు రైతుకు తోడ్పాటు నందిస్తాయి. జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పంటలు సాగుచేసి పచ్చిరొట్టగా మార్చి పొలాన్ని సారవంతం చేసుకుని పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

### జిల్లాకు 3,047 క్వింటాళ్ల విత్తనాలు కేటాయింపు

పంటల్లో దిగుబడి పెంచి రైతుకు అండగా ఉండేందుకు ప్రభుత్వం జిల్లాకు 3047 క్వింటాళ్లు కేటాయించింది. రైతులకు క్వింటాకు 50శాతం రాయితీతో సమీప రైతు సేవా కేంద్రాల నుంచే రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా ఆర్ఎస్‌కేలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రైతులు పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

### పచ్చిరొట్ట మంచి పోషకాలను ఇస్తుంది



పచ్చిరొట్ట భూములకు మంచి పోషకాలను అందిస్తుంది. పంటలకు మేలుచేసే సూక్ష్మ జీవులను వృద్ధి చేయడంతో పాటు జీవ రసాయనిక చర్యలతో నేలసారం పెరుగుతుంది. సూక్ష్మజీవులు ఉత్పత్తి చేసే హార్మోన్ల వల్ల మొక్కల పెరుగుదల వృద్ధి చెందుతుంది. అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుని, 50శాతం సబ్సిడీతో విత్తనాలను పొందవచ్చు.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

### చౌడు భూముల్లో జీలుగ మేలు

క్షారగుణం కలిగిన చౌడుభూములతో పాటు వరి పండించే భూముల్లో ఎక్కువగా జీలుగ వేసుకోవచ్చు. ఎకరాకు 10 కిలోల నుంచి 15కిలోల వరకు విత్తనాలను ఇసుకలో కలిపి చల్లడంతో పొలానికంతా సమానంగా పడుతుంది. జీలుగ పూతదశలో ఉన్నప్పుడు భూమిలో కలియదున్నడం వల్ల ఎకరాకు 9నుంచి 10టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. చౌడు భూములను మామూలు భూములుగా తీసుకురావడానికి జీలుగ పచ్చిరొట్ట బాగా ఉపయోగపడుతుంది. ఇందులో 3.5శాతం నత్రజని (పాయింట్).5శాతం భాస్వరం, 1.2 శాతం పొటాష్ లభిస్తుంది.

### జీలుగ విత్తనాలు కేటాయింపు ఇలా..

జీలుగ విత్తనాలను ఆళ్లగడ్డ మండలానికి 215 క్వింటాళ్లు, ఆత్మకూరు 47 క్వింటాళ్లు, బనగానపల్లె 109.5, బండిఆత్మకూరు 574.3, దొర్నిపాడు 2.9, గోస్పాడు 100, జూపాడుబంగ్లా 24.4, కోవెలకుంట్ల 21.5, మహానంది 330, మిడ్తూరు 4.4, నంద్యాల 330, పగిడ్యాల 6.9, పాములపాడు 100, పాణ్యం 67, రుద్రవరం 311.3, శిరువెళ్ల 586.4, వెలుగోడు 185 క్వింటాళ్లు కేటాయించారు.

### తేలికైన, బరువైన నేలల్లో పిల్లిపెసర మేలు

తేలికైన, బరువైన నేలల్లో సాగుచేయవచ్చు. చౌడుభూముల్లో సాగు పనికిరాదు. ఎకరాకు 6 నుంచి 8 కిలోల విత్తనం వేయడం వల్ల 3 నుంచి 4 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. ఇందులో (పాయింట్).7 నత్రజని, .18 భాస్వరం, 1.5 పొటాష్ లభిస్తుంది.

### పిల్లిపెసర ఐదు మండలాలకు కేటాయింపు

పిల్లిపెసర విత్తనాలను బనగానపల్లె మండలానికి ఒక క్వింటా, బండిఆత్మకూరు మండలానికి ఐదు క్వింటాళ్లు, మహానంది మండలానికి ఐదు క్వింటాళ్లు, నంద్యాల మండలానికి నాలుగు క్వింటాళ్లు, పాణ్యం మండలానికి 4 క్వింటాళ్లు కేటాయించారు.

### రెండు మండలాలకు జనుము విత్తనాలు

ఎకరాకు 15 కేజీల జనుము విత్తనాలు వేయాలి. పంట పూతదశ వరకు పెంచి భూమిలో కలియదున్నాలి. ఇందులో 2.3శాతం నత్రజని, (పాయింట్).5 శాతం భాస్వరం, 1.8 శాతం పొటాష్ లభిస్తుంది. సంజామల మండలానికి 2.9 క్వింటాళ్లు, శిరివెళ్ల మండలానికి 2 క్వింటాళ్లు కేటాయించారు.

## భారత సైన్యానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు

- రచయిత, నటుడు శంకర్ రాజు



కళాకారులను సన్మానించి జ్ఞాపికలు అందజేసిన ప్రముఖులు



'బావ ఎప్పుడు వచ్చితీవి' నాటకంలోని ఓ దృశ్యం

కర్నూలు కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టడంతో భారత సైన్యానికి ప్రపంచంలోనే ఒక గుర్తింపు వచ్చిందని పౌరాణిక రంగ స్థల నటుడు షణ్ముఖి ఆంజనేయరాజు అల్లుడు హైదరాబాద్‌కు చెందిన నాటక రచయిత, నటుడు మందిరాజు శంకర్‌రాజు అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న జై జవాన్ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమం ఆరో రోజు గురువారం నిర్వహించిన కార్యక్రమాలకు శంకర్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం భరతమాత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన దేశభక్తి నృత్యాలను గీతాలను ఆలపించిన కళాకారులను సత్కరించి మాట్లాడుతూ భారత సైన్యానికి మనందరం ఎల్లవేళలా రుణపడి ఉంటామన్నారు. సైన్యం త్యాగాలను కొనియాడాల్సిన అవసరం ఉందన్నారు. కళాక్షేత్ర అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ గత ఆరు రోజుల నుంచి భారత్ మాతాకి జై అనే నినాదంతో ఆడిటోరియం మార్మోగి పోయిందన్నారు. రాష్ట్రంలో మొదటి సారి ఒక కళా సంస్థ వారం రోజుల పాటు జై జవాన్ పేరుతో వేడుకలను నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో కేవీ రమణ, బాల వెంకటేశ్వర్లు, రంగస్థల కళాకారులు వీవీ రమణారెడ్డి, పి.దస్తగిరి, హనుమంతరావు చౌదరి, మహ్మద్ మియా, ఇనాయతుల్లా, యాగంటీశ్వరప్ప, సీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నవ్వించిన 'బావ ఎప్పుడు వచ్చితీవి' నాటిక:** జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా గురువారం రాత్రి ప్రదర్శించిన 'బావ ఎప్పుడు వచ్చితీవి' సాంఘిక హాస్య నాటిక అసాంతం ప్రేక్షకులను నవ్వించింది. టీజీవీ కళాక్షేత్రం కళాకారుడు సంగా ఆంజనేయులు దర్శకత్వంలో ప్రదర్శించారు. మహిళలపై చిన్నచూపు తగదంటూ కళాకారులు మహ్మద్ మియా, సంగా ఆంజనేయులు, భాస్కర్, చల్లా నవీన్ కుమార్ చౌదరి, రేణుక చూపిన ప్రదర్శన ఆలోచింపజేసింది.



నృత్యం చేస్తున్న కళాకారులు

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

**కర్నూలు అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి):** సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6వ సెమిస్టర్ ఫలితాలను క్లస్టర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. 2022-25 బ్యాచ్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహించామని, 216 మంది పరీక్షలు రాయగా 216 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో అధ్యాపకులను అభినందించారు.

## స్పీకర్‌ను కలిసిన కలెక్టర్ రాజకుమారి


స్పీకర్‌కు మొక్క ఇస్తున్న కలెక్టర్

**నంద్యాల నూనెపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడుని నంద్యాల కలెక్టర్ రాజకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నంద్యాలకు వచ్చిన అయ్యన్న పాత్రుడు రోడ్లు భవనాల అతిథి గృహంలో ఉండగా కలెక్టర్ రాజకుమారి కలిసి పూల మొక్కను అందజేశారు. నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధిపై వారు చర్చించారు.

## ఇంటర్ పరీక్షల్లో ఒకరి డిబార్

**కర్నూలు ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి):** ఇంటర్ సప్లిమెంటరీ మొదటి సంవత్సరం పరీక్షల్లో మాల్‌ప్రాక్టీసుకు పాల్పడిన ఓ విద్యార్థిని గురువారం డిబార్ చేసినట్లు ఆర్ఐవో గురువయ్యశెట్టి తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 491 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 9380 మంది నమోదు చేసుకోగా, 8963 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, ఇందులో 417 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1277 మంది నమోదు చేసుకోగా, 1203 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 74 మంది గైర్హాజరయ్యారు. బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మాల్‌ప్రాక్టీసుకు పాల్పడిన ఓ విద్యార్థిని డిబార్ చేశామన్నారు. పరీక్షా కేంద్రాలను డీవీఈవో సురేష్‌బాబు, జిల్లా డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారు.

## విధుల్లో చేరిన ఎస్పీ

**కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి):** ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం తిరిగి విధుల్లో చేరారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఎస్పీ వ్యక్తిగత సెలవులపై కుటుంబ సభ్యులతో కలిసి జపాన్‌కు వెళ్లారు. తిరిగి గురువారం విధుల్లో చేరారు. అనంతరం ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లపైన సి.క్యాంపు, కేంద్రీయ విద్యాలయం, ధనలక్ష్మి, పార్కు, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

## భూగర్భ జలాల నిల్వకు చర్యలు

- జూన్ ఆఖరుకు 8,500 కుంటలను పూర్తి చేయడమే లక్ష్యం
- జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటరమణయ్య

**కర్నూలు అగ్రికల్చర్, మే 15 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో భూగర్భ జలాలను పెద్దఎత్తున నిల్వచేసేందు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా 8500 పంటకుంటలు జూన్ నెలాఖరులోగా నిర్మిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య గురువారం తెలిపారు. రైతులు తమ పొలాల్లో వీటిని తవ్వకుంటే వర్షం నీరంతా పంటకుంటల్లో నిల్వ ఉండి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు ఈ నీటిని పంటలకు వినియోగించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. పంటకుంటల ఏర్పాటు కోసం ఇప్పటికి 7వేల మంది రైతులను గుర్తించామని, వీరి పొలాల్లో 2,500 పంటల గుంటల పనులు జరుగుతున్నాయని తెలిపారు. వీటిలో 800 దాకా పూర్తి చేశామని, 1600 పురోగతిలో ఉన్నాయన్నారు. వీటి తవ్వకం కోసం ఉపాధి కూలీలకు 12లక్షల పనిదినాలు కల్పిస్తామని, రూ.36.84 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అధికారి వెల్లడించారు.

## బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


మాట్లాడుతున్న నగర బలిజ సంఘం అధ్యక్షుడు లక్ష్మన్న

**కర్నూలు కల్చరల్, మే 15(ఆంధ్రజ్యోతి):** ఈ విద్యాసంవత్సరం 'పది', ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు నగర బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవికుమార్ తెలిపారు. గురువారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రతిభా పురస్కారాలు వివరాలు తెలిపే బ్రోచర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాండ్ల లక్ష్మన్న మాట్లాడుతూ పదో తరగతిలో 550 మార్కులు, ఇంటర్‌లో 950 మార్కులు సాధించిన విద్యార్థులు తమ మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, చిరునామా, ఫోన్ నెంబర్‌ను 9000009440 నెంబరుకు వాట్సాప్ ద్వారా ఈ నెల 22వ తేదీలోపు పంపి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీ ప్రతిభ పురస్కారాల ప్రదాన కార్యక్రమం కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, 2 వేలు నగదు బహుమతులు అందజేస్తామని, మెరిట్ విద్యార్థులందరికీ జ్ఞాపిక, ప్రతిభ పురస్కార పత్రం ఇవ్వనున్నామని తెలిపారు. ప్రతిభ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రధాన సలహాదారుడు డా.సింగంశెట్టి సోమశేఖర్, సహాయ కార్యదర్శి ప్రకాష్‌బాబు, రాయల మహిళా సంఘం అధ్యక్షురాలు అలుపూరి సుజాత పాల్గొన్నారు.

## రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

**వెల్దుర్తి, మే 15(ఆంధ్రజ్యోతి):** రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన దూదేకుల చిన్నబాబు(42) బొమ్మిరెడ్డిపల్లెలో కూతురు వద్ద ఉంటున్నారు. అయితే అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం రాత్రి ఇంటిలో నుంచి వెళ్లిన వ్యక్తి గురువారం ఉదయం రైలు పట్టాలపై విగత జీవిగా కనిపించారు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఏఎస్ఐలు ప్రేమ్‌కుమార్, రమేశ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. కేసు నమోదు చేసుకున్నారు. కర్నూలు సర్వజనవైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ మాధవస్వామి, సిబ్బంది ఉన్నారు.

## పిడుగుపాటుకు వ్యక్తి మృతి

**చాగలమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి):** పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. వివరాలు.. మండలంలోని తిప్పనపల్లె గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున పిడుగు పాటుకు గుర్రై చంద్రశేఖర్ (24) అనే వ్యక్తి మృతిచెందాడు. కడప జిల్లా తొండూరు మండలం కొరవానిపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో పాటు మరో ఐదుగురు గొర్రెలు మేపుకునేందుకు వచ్చారు. ఆయా పొలాల్లో రాత్రి వేళలో నివాసం ఉంటున్నారు. ఉరుములు, మెరుపు లతో కూడిన వర్షంతో పాటు ఒక్కసారిగా పిడుగు పడింది. సమీపంలో ఉన్న శేఖర్ ఆ శబ్దానికి అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తోటి కాపరులు కూడా భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చేరుకుని, సంఘటన గురించి ఆరాతీశారు. ఎస్ఐ సురేష్‌బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# కేంద్రం నియంత్రణలోకి ఉపాధి

- యుక్తధార యాప్ అమలులోకి
- ప్రతి పనిని నమోదు చేయాలని ఆదేశాలు
- పనులు, చెల్లింపులు అన్నీ ఢిల్లీ నుంచే


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

**కర్నూలు అగ్రికల్చర్, మే 15(ఆంధ్రజ్యోతి):** ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆజమాయిషీలో ఉపాధి హామీ పనులు సాగాయి. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ తమ ఆధీనంలో ఉండేలా చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఇక నామమాత్రంగానే ఉండబోతోందని ఈ పథకాన్ని అమలు చేస్తున్న నీటి యజమాన్య సంస్థ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకునేందుకు కేంద్రం 'యుక్తధార' అనే యాప్‌ను రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించేందుకు 2005లో ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించేలా చేసింది. ఏపీవో, ఎంపీడీవోలు పర్యవేక్షించేవారు. పనుల కల్పన, బిల్లుల చెల్లింపులు అన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కొనసాగేవి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'యుక్తధార' యాప్ ద్వారా ఇప్పటి దాకా ఈ పథకంలో జరుగుతున్న ప్రాసెస్ కనుమరుగయ్యే అవకాశముంది.

**యాప్ అమలు తీరు ఇలా..**

కేంద్ర ప్రభుత్వం 'యుక్తధార' యాప్‌ను తీసుకువచ్చింది. ఎక్కడ ఎలాంటి పనులు జరుగుతున్నాయో ఏప్రాంతంలో ఏ పని ఎప్పుడు చేయాలో అంచనాలు ఎలా వేయాలి, బిల్లుల చెల్లింపులు ఎలా జరగాలనే అంశాలన్నింటినీ ఈ యాప్ ద్వారా ఢిల్లీలో కూర్చుని కేంద్ర ప్రభుత్వ అధికారులు నిర్ణయించనున్నారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి అవసరమైన లేబర్ బడ్జెట్ ఆమోదం తెలుపుతుంది. కూలీలు చేయాల్సిన పనులన్నీ కేంద్రమే గుర్తిస్తుంది. వారికి డబ్బులు నేరుగా కేంద్రమే వారి అకౌంట్లకు జమ చేస్తుంది. ఇప్పటికే 'యుక్తధారయాప్ వినియోగంలో ఉందని, తొలి దశగా జిల్లా వ్యాప్తంగా మండలానికో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసు కుని అమలు చేస్తున్నట్లు కర్నూలు నీటి యజమాన్య సంస్థ పీడీ వెంకటరమణ తెలిపారు. రెండో దశలో జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ అమలు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# శాసనసభ స్పీకర్‌కు ఘన స్వాగతం

- ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక వాహనంలో నంద్యాలకు..



అయ్యన్నపాత్రుడుకి పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

**ఓర్వకల్లు, మే 15 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఓర్వకల్లు విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేరుకున్నారు. స్పీకర్‌కు కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ సైతం పుష్పగుచ్ఛం అందజేశారు. పలు అంశాలపై ప్రజాప్రతినిధులతో స్పీకర్ చర్చిం చారు. స్పీకర్‌కు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, తహసీల్దార్ విద్యాసాగర్ స్వాగతం పలికారు. ఎస్ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక వాహనంలో నంద్యాలకు బయలుదేరి వెళ్లారు.

## చికిత్స పొందుతూ ఎస్ఐ మృతి

**కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి):** అగ్ని ప్రమాదంలో గాయపడిన ఎస్ఐ మాసన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. 1989 బ్యాచ్‌కు చెందిన ఈయన పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ప్రస్తుతం సీసీఎస్ విభాగంలో ఎస్ఐగా పని చేస్తున్నారు. ఈ నెల 5వ తేదీన కర్నూలు నగరం లోని ఇంట్లో అగ్ని ప్రమాదం జరగ్గా తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా.. కోలుకోలేక మృతి చెందా రు. మాసన్నకు భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

## విజిలెన్స్ దాడులు

- 58 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని సంతోష్‌నగర్ వద్ద ఉన్న మల్లికార్జున రైస్‌మిల్లులో విజిలెన్స్ అధికారులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 58 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డీసీటీవో వెంకటరమణ, ఎస్ఐ నరేంద్ర భూపతి, తమ సిబ్బందితో దాడులు చేసి ఈరేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. వీటిని సివిల్ సప్లైస్ అధికారులకు అప్పగించారు. మిల్లు యజమాని శ్రీనివాసరావుపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

**కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి):** డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురికి కోర్టు జరిమానా విధించింది. గత రెండు రోజులుగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిం చిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురు పట్టుబడ్డారు. పట్టుబడిన ఏడుగురు మందుబాబులను గురువారం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వీరికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరి మానా విధించిందని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

## ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

- నలుగురికి తీవ్ర గాయాలు

**ఓర్వకల్లు, మే 15 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై గురువారం పూడిచర్ల బస్ స్టేజీ వద్ద జరిగిన ప్రమాదంలోనలుగురు ప్రయాణీకులకు తీవ్రగాయాలయ్యాయి. ఆళ్లగడ్డ డిపో చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు వెళ్తాండగా.. ముందు భాగంలో వెళ్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో బస్సు ముందు భాగం లారీనీ ఢీకొనడంతో బస్సులో ఉన్న జ్యోష్న, నిర్మల, వసంత కుమారి, ధర్మతేజకు గాయాలు కాగా, చికిత్స నిమ్మితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకుల పిలుపు
- ప్రజా వేదిక ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న గౌరు దంపతులు, టీడీపీ నాయకులు

**కల్లూరు, మే 15(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఒక విజన్‌తో కష్టపడి పనిచేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఈనెల 17న కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేయుచున్న నేపథ్యంలో కేంద్రీయ విద్యాలయ సమీపంలో గురువారం టీడీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, పాలకుర్తి తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో కలిసి ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సి.క్యాంపు రైతుబజార్‌లో పాల్గొంటారని అనంతరం నంద్యాల రోడ్ కేంద్రీయ విద్యాలయ సమీపంలో సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల ఇన్‌చార్జ్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, రామాంజనేయులు, కెవి.సుబ్బారెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, వాకిటి మాదేష్ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులు వాడాలి

- భూసారాన్ని రాబోయే తరాలకు అందించాలి
- ఎన్‌జీ రంగా వసాయ కళాశాల అసోసియేట్ డీన్ జయలక్ష్మి
- ఎస్సీ రైతులకు సేంద్రియ ఎరువుల పంపిణీ


ఎస్సీ రైతులకు సేంద్రియ ఎరువులను అందజేస్తున్న జయలక్ష్మి

**మహానంది, మే 15 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణానికి అనుకూలంగా ఉండే సేంద్రియ ఎరువులను వాడాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి అన్నారు. గురువారం మహానంది సమీపంలోని వ్యవసాయ కళాశాల ఆవరణలో సేంద్రియ వరి సాగు భూముల్లో సేంద్రియ ఎరువుల ప్రాచుర్యంపై గోస్పాడు మండలంలోని ఎస్సీ రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను వాడి భూసారాన్ని భావితరాలకు అందించాలన్నారు. ఆధునిక పద్ధతులతో రసాయనిక ఎరువుల వినియోగం పెరిగిందన్నారు. వరిలో దిగుబడి పెంచుకోవడానికి సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. అనంతరం రైతులకు ఒక్కొక్కరికి 200 కేజీల వర్మికంపోస్టు, జీవన ఎరువులతోపాటు 2025-26 సంవత్సర వ్యవసాయ పంచాంగంను అందజేశారు. శాస్త్రవేత్త ఎల్.విజయ భాస్కర్, ఐసీఏఆర్ ఎస్సీ సబ్ ప్లాన్ ప్రాజెక్ట్ ప్రధాన పరిశోధకురాలు పీవీ గీతా శిరీష, వి. శివజ్యోతి పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాపై సీఎం ప్రత్యేక దృష్టి

- రేపటి పర్యటనను విజయవంతం చేద్దాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి
- జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులతో సమావేశం


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

**కర్నూలు అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలోని రైతుబజార్ వద్ద 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంతో పాటు నగర శివారులో ప్రజావేదిక ద్వారా పలుఅంశాలపై మాట్లాడతారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి సమానం చేయాలనే లక్ష్యంతో పాణ్యం నియోజకవర్గ పర్యటన చేపట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశారన్నారు. జూన్ 12న తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థి తల్లి అకౌంట్లో ప్రకటించిన మేరకు మొత్తాన్ని జమ చేస్తారని అన్నారు. ఈ సమావేశంలో నంద్యాల నాగేంద్ర, కాసాని మహేష్‌గౌడ్, సత్రం రామక్రిష్ణుడు, బేతం కృష్ణుడు, హనుమంతరావు చౌదరీ, నంది మధు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా పోటీలకు క్లస్టర్ విద్యార్థులు

కర్నూలు స్పోర్ట్స్, మే 15(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా పోటీలకు క్లస్టర్ విద్యార్థులు ఎంపికైనట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు.



## సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

### పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న కర్నూలులో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్లూరు రూరల్, అర్బన్ నాయకులతో గౌరు దంపతులు, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ రాష్ట్రంలో పాణ్యం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కల్లూరు మండల కన్వీనర్ డి.రామాంజనేయులు, వాకిటి మాదేష్, పాల్గొన్నారు.

**ఓర్వకల్లు:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభను జయప్రదం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కోరారు. ఈనెల 17న పాణ్యం నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర


ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు కల్లూరు అర్బన్ 20వ వార్డులో సభ నిర్వహించనున్నారు. గురువారం ఓర్వకల్లులోని జీవేశ్వరస్వామి కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆమె, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు సభకు మండలం నుంచి 10వేల మంది దాకా సభకు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పాణ్యం వాణిజ్యం విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, సుధాకర్‌రావు, విజయుడు, శ్రీనివాసులు, ఏసేపు, మహబూబ్ బాషా, అల్లాబాబు, యాసీన్, ఖాజా మియా, చంద్రశేఖరప్ప, శ్రీనివాసులు, శోభన్ పాల్గొన్నారు.

**ఎయిర్‌పోర్టులో కలెక్టర్, ఎస్పీ భద్రతా ఏర్పాట్లు పరిశీలన:** సీఎం చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం సాయంత్రం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలన్నారు.

## గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి: పీడీ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

కల్లూరు, మే 15(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.చిరంజీవి లబ్ధిదారులకు సూచించారు. గురువారం కల్లూరు మండలం పెద్దటేకూరు, బస్తిపాడు గ్రామాల్లోని లేఅవుట్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు ప్రస్తుతం అందించే రూ.1.8 లక్షలకు అదనంగా బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, మగ్గం వారికి రూ.50వేలు, చెంచులకు రూ.లక్ష మంజూరు చేసిందన్నారు. హౌసింగ్ ఈఈ వెంకటదాసు, డీఈఈ ప్రభాకర్, కల్లూరు హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాలు చేపట్టాలి: ఎస్టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని కలిసి ఎస్టీయూ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2017 నుంచి ఇప్పటి వరకు జూనియర్ సహాయకుల పోస్టుల కోసం 87 మంది కారుణ్య నియామకాల కింద దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. అలాగే జిల్లా పరిషత్‌లో సుమారు 30 వరకు ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు డిగ్రీ, టీపీటీ పరీక్షలు ఉత్తీర్ణులు కావాల్సి ఉందని, టీపీటీ పరీక్షలు ఇన్ సర్వీసు వారికే వర్తిస్తాయి కనుక డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి నియామకాల నుంచి రెండు సంవత్సరాల్లో టీపీటీ పరీక్షలను చేపట్టాలని కోరారు. అదే విధంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల రుణాలు, తుది చెల్లింపులు త్వరగా చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు స్పందించిన జడ్పీ ఛైర్మన్ కారుణ్య నియామకాల చేపట్టడానికి చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, జిల్లా ప్రధాన కార్యదర్శి టికే జనార్దన్ తెలిపారు.

## లేఖ ఇస్తే క్యాంటీన్ సమస్యను పరిష్కరిస్తాం

### కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ

కర్నూలు హాస్పిటల్, మే 15(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ నాయకులు లేఖ ఇస్తే క్యాంటీన్ సమస్యను పరిష్కరిస్తామని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ అన్నారు. గత వారం రోజుల నుంచి కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్ వివాదంపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ప్రిన్సిపాల్ స్పందించారు. ఏపీ వైద్యుల సంఘం నాయకులు క్యాంటీన్ వివాదంపై ఇంత వరకు రాత పూర్వకంగా తనకు ఫిర్యాదు గానీ, లేఖ గానీ ఇవ్వలేదన్నారు. కేఎంసీ క్యాంటీన్ అనేది అసోసియేషన్‌కు సంబంధించిన వ్యవహారమని, సంఘం నేతలు నాలుగైదు సార్లు ప్రిన్సిపాల్ చాంబర్‌కు వచ్చిన ఇంతవరకు ఒక్క లేక కూడా ఇవ్వలేదన్నారు. ఉదయం క్యాంటీన్‌కు తాళం వేయడం, అదే రోజు కొన్ని గంటలకే తాళాలను పగులకొట్టడం సరికాదన్నారు. ఒకవేళ అసోసియే షన్ నాయకులు లేఖ ఇవ్వని పక్షంలో రెండు మూడు రోజులు వేచి చూసి తామే క్యాంటీన్‌ను స్వాధీనం చేసుకుంటామన్నారు.

## 'ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి'

కర్నూలు న్యూసిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): అప్రజాస్వామికంగా జరిపిన ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట వేదిక అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ టీజీవీ ఎస్ఆర్ఏసీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణలో పర్యావరణాన్ని ప్రభావితం చేసే రసాయనాలు ఉన్నాయని, దానికి అనుమతి ఇవ్వరాదని ప్రజాభిప్రాయ సేకరణలో ఇష్టానుసరంగా వ్యవహరించారని అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీఆనంద్‌బాబు, మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుజీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## దుండగులపై కేసులు నమోదు చేయాలి

కర్నూలు న్యూసిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): అల్కాలీస్ పరిశ్రమకు సంబంధించి తమ అభిప్రాయాలను చెప్పడానికి వెళ్లిన ప్రజా సంఘాల నాయకులపై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏకపక్షంగా జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ తక్షణమే రద్దు చేయాలన్నారు. నాయకులు ఎం.రాజ శేఖర్, బి.రాముడు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు

కోడుమూరు రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండ గ్రామంలో కొందరు అక్రమార్కులు కొండను తవ్వి యథేచ్ఛగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. స్థానిక పోచమ్మ కొండ నుంచి ఎర్రమట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఎర్రమట్టి రూ.800 వరకు అమ్ముకుంటున్నారు. ఇక్కడి కొండపై పురాతన పోచమ్మ ఆలయం ఉంది. గ్రామప్రజలు ఆలయంలో అమ్మవారికి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం ఎర్రమట్టి తవ్వకాలు చేస్తున్నట్లు గమనించిన స్థానికులు కొందరు రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించడంతో వారు తనిఖీలు చేశారు. గమనించిన అక్రమార్కులు ఓ ట్రాక్టర్‌ను వదలి పారిపోవడంతో దాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

## టీడీపీ పదవుల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించాలి

కర్నూలు అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో త్వరలో జరగబోయే సంస్థాగత ఎన్నికల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పదవుల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటరామరాజు కోరారు. గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డారు. బ్రహ్మణులు అన్ని రంగాల్లో వెనుక బడ్డారని, గత ఎన్నికల్లో 90 శాతం బ్రహ్మణులు టీడీపీకి మద్దతు ఇచ్చారని, వారికి పదవుల్లో సముచితస్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దేశాయ్ కృష్ణమూర్తి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంకే నాగరాజు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాభివృద్ధికి కలెక్టర్ కృషి: డీఈవో



కర్నూలు ఎడ్యుకేషన్, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాభివృద్ధికి కలెక్టర్ రంజిత్ బాషా కృషి చేశారని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. జిల్లాలో పాఠశాలల విద్యారంగం బలోపేతానికి ప్రతిపాదనలు పంపి అత్యధిక పోస్టులు మంజూరు చేయించిన సందర్భంగా గురువారం కలెక్టర్‌ను డీఈవో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలల్లో రాబోవు సంవత్సరానికి ఎటువంటి టీచర్ల కొరత లేకుండా జిల్లాకు కొత్త పోస్టులు, పాఠశాలలు మంజూరు చేయించడం పట్ల జిల్లా విద్యాశాఖ రాబోవు విద్యాసంవత్సరంలో నూతన ఉత్తేజం పొందుతుందన్నారు. 49 ఫౌండే షన్ పాఠశాలలు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 278, మోడల్ ప్రైమరీ పాఠశాలలు 754, అప్పర్ ప్రైమరీ స్కూళ్లు 32, ఉన్నత పాఠశాలలు 337, మొత్తం 1455 పాఠశాలలు జీవో.117 రద్దు తర్వాత ఏర్పడటం జరిగాయ న్నారు. కన్వర్షన్ ఆఫ్ స్కూల్ అసిస్టెంట్ల పోస్టుల కింద 251, ఆదర్శ ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులుగా మంజూరయ్యాయని తెలి పారు. సర్‌ప్లస్‌గా ఉన్న 97 పోస్టులను అవసరమైన ఖాళీలకు అనుగుణంగా కన్వర్టు చేశారన్నారు. కొత్తగా 86 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 957 స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు, 406 ఎస్జీటీ పోస్టులు కలుపుకుని మొత్తం 1449 పోస్టులు మంజూరైనట్లు డీఈవో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు 5, ఉపాధ్యాయులు 8 సంవ త్సరాల సర్వీసు పూర్తి చేసిన ఖాళీలు 2713 ఉన్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్లు కన్వర్టు ద్వారా 251, ఎస్జీటీ కన్వర్టు ద్వారా 93 పోస్టులు, అప్‌గ్రేడ్ ద్వారా 100 పోస్టులు కొత్తగా సృష్టించిన ఖాళీలు 1449, సర్ ప్లస్ షిఫ్టు ద్వారా 1143 పోస్టులు కలిపి మొత్తం 8047 జిల్లా వ్యాప్తంగా ఖాళీలు ఉన్నాయన్నారు.


కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న డీఈవో

## కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై కాల్వబుగ్గ బస్ స్టేజీ వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు నుంచి నంద్యాల వెళ్తున్న రాముడును వెనుక వైపు నుంచి కారు ఢీకొనడంతో తలకు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం టోల్‌ప్లాజా అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రివిలేజ్ కమిటీలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే

కర్నూలు రూరల్ మే 15(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వెలగపూడిలో గురువారం అసెంబ్లీలో నిర్వహించిన ప్రివిలేజ్ కమిటీ సమావేశంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ సమావేశానికి ప్రివిలేజ్ కమిటీ చైర్మెన్ పితాని సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కమిటీలో సభ్యుడిగా బొగ్గుల దస్తగిరి ఉన్నందున సమావేశానికి పాల్గొని రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితుల గురించి చర్చించారు.

## మంజులాదేవికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు

కర్నూలు హాస్పిటల్, మే 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకుని విజయవాడకు చెందిన హెల్త్ కేర్ మాస పత్రిక కర్నూలు జీజీహెచ్‌కు చెందిన స్టాఫ్ నర్సు డి.మంజులాదేవికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందజేశారు. గురువారం విజయవాడ హెల్త్ క్లబ్‌లో హెల్త్ కేర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యరంగంలో విశేష సేవలు అందిస్తున్న మంజులదేవికి హెల్త్ కేర్ మాసపత్రిక ఎడిటర్ డి.నరేంద్రసాయి, ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ అవార్డును అందజేశారు.

## టీడీపీతోనే కార్యకర్తల సంక్షేమం

గూడూరు మే 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే కార్యకర్తలకు మేలు జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు జే.సురేష్ అన్నారు. గురువారం గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. సురేష్ మాట్లాడుతూ కోటి సభ్యత్వాలు చేసిన ఒకే ఒక్క పార్టీ తెలుగుదేశం పార్టీనే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గోపాల్ రెడ్డి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట్రాముడు, ఎంపీటీసీ మద్దిలేటి, కరణం చిన్నగిడ్డయ్య, రవి, నగేష్, యుగంధర్, తిరుపాలు, పాల్గొన్నారు.

## మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు

కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ సీఐ, ఉలిందకొండ ఎస్ఐ, రియల్ ఎస్టేట్ వ్యాపారి కేజే రెడ్డిపై ఉలిందకొండ చెందిన నాగన్న, ఆయన భార్య మానవహక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఉలిందకొండ గ్రామంలో తను సాగు చేస్తున్న చుక్కల భూమిని కేజే రెడ్డికి అప్పగించాలని, పోలీసులు తమపై ఒత్తిడి తెస్తున్నారనీ, ఇటీవల తమను స్టేషన్‌కు పిలిపించి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## నేడు కళాకారుల ర్యాలీ రద్దు

కర్నూలు కల్చరల్, మే 15(ఆంధ్రజ్యోతి): జై జవాన్ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం నిర్వహిం చాల్సిన కళాకారుల ర్యాలీ రద్దు అయినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న కల్చరల్ ఫెస్ట్ లో భాగంగా శుక్రవారం సాయంత్రం రాజ్యసభ ఎంపీ టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు పత్తి ఓబులయ్య తెలిపారు.

## మార్క్‌ఫెడ్ పశుదాణా కర్మాగారానికి ప్రతిష్ఠాత్మక గుర్తింపు

కర్నూలు అగ్రికల్చర్, మే 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రైతులకు ఎంతో ప్రయోజనాన్ని అందిస్తున్న నంద్యాలలోని మార్క్‌ఫెడ్ పశుదాణా కర్మాగారానికి ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. గురువారం విజయవాడలో జరిగిన పశుసంవర్ధక శాఖ టెక్ ఏఐ 2.0 కాంక్లేవ్‌లో జిల్లాలో ఉన్న మార్క్‌ఫెడ్ పశుదాణా కర్మాగారం రాష్ట్ర స్థాయిలో విలువైన భాగస్వామిగా ఎంపికైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి మేనేజర్ బి.నాగరాజు జ్ఞాపికను స్వీకరించారు.




సి.క్యాంపు రైతు బజార్ వద్ద సాగుతున్న పనులు


కేంద్రీయ విద్యాలయం వద్ద ప్రజావేదిక ఏర్పాటు పనులు

## చకచకా పనులు

కర్నూలు అగ్రికల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతు బజార్ వద్ద, కేంద్రీయ విద్యాలయం వద్ద ప్రజా వేదిక పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈ పనులను రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది.


సి.క్యాంపు రైతు బజార్ వద్ద మురుగు కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు


ప్రజావేదిక వద్ద కొనసాగుతున్న పనులు

## మైనార్టీలకు రుణాలు మంజూరు

**తుగ్గలి, మే 15 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసిందని ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. గురువారం కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, పెరవలిలో ఉన్న ఏపీజీబీ బ్యాంకులతో పాటు పత్తికొండ, పెండేకల్ ఆర్ఎస్‌లో పరిధిలో ఉన్న స్టేట్ బ్యాంకు పరిధిలోని మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఈ నెల 25వ తేదీలోపు ఎంపీడీవో కార్యాలయంలో అందించాలన్నారు.

## పనితీరు మార్చుకోకుంటే చర్యలు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురామిరెడ్డి


మాట్లాడుతున్న రఘురామిరెడ్డి

**హాలహర్వి, మే 15 (ఆంధ్రజ్యోతి):** పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురామిరెడ్డి హెచ్చరించారు. గురువారం అర్ధగేరి ఆరోగ్య కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. సర్వే చేయడం, పల్లెల్లో వైద్యసేవల్లో విఫలమయ్యాని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లెలకు వెళ్లడం లేదని తనకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వారం రోజుల్లో మార్పురాకుంటే వైద్యాధికారితో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యాధికారులు గంగాధర్, ఈరన్న ఉన్నారు.

## సమ్మెను జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

**ఆదోని అగ్రికల్చర్, మే 15 (ఆంధ్రజ్యోతి):** కార్మిక చట్టాల రక్షణకు ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు వి.ప్రసాద్, కార్యదర్శి పోలారి పిలుపునిచ్చారు. గురువారం గోడపత్రికలను విడుదల చేశారు. కార్మికులు, రైతులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాల రాసిందని ఆరోపించారు. నూతన అగ్రి మార్కెటింగ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఐకేఎంఎస్ కార్యదర్శి మల్లికార్జున, ప్రసాద్, వెంకప్ప, మణి, అఖండ, కుమార్ నారాయణ చౌరప్ప పాల్గొన్నారు.

## పార్టీ మారే ప్రసక్తే లేదు

**ఆదోని టౌన్ , మే 15 (ఆంధ్రజ్యోతి):** పార్టీ మారే ప్రసక్తి లేదని, వేరే పార్టీలో చేరుతున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని బీజేపీలోనే కొనసాగుతామని కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ, బీజేపీ నాయకుడు వెల్లాల మధుసూదన్ శర్మ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇన్‌చార్జి చైర్మన్ ముల్లాగౌస్, ఎన్నికలలో సహకరించిన కౌన్సిలర్ సందీప్‌రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా మాత్రమే కలిసి అభినందించామన్నారు. తమకు ఎమ్మెల్యే పార్థసారథి ప్రాధాన్యమిస్తున్నారని, ఆయన అనుచరులుగానే కొనసాగుతామని అన్నారు.


మాట్లాడుతున్న లలితమ్మ

## అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

**మద్దికెర, మే 15 (ఆంధ్రజ్యోతి):** రాజ్యాంగ రచయిత డా.బీఆర్ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ పేర్కొన్నారు. గురువారం మెయిన్‌బజారులో అంబేడ్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ నిరుపేద కుటుంబంలో పుట్టి దేశంలోనే పేరు ప్రఖ్యాతులు పొందారన్నారు. యువత ఏ రంగంలోనైనా రాణించాలంటే ఆశయం ఉండాలన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించిన గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

## గ్రామాల్లో పెరిగిన తాగునీటి ఎద్దడి

● మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్



**ఆదోని టౌన్ , మే15 (ఆంధ్రజ్యోతి):** నియోజకవర్గంలోని పెద్ద హరివాణం, సంతేకూడ్లూరు, సాంబగళ్లు, సలకలకొండతో పాటు మిగతా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ అన్నారు. గురువారం మాట్లాడుతూ ముందస్తు ప్రణాళిక వేసుకోవడంలో అధికారులు, నాయకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఎస్.కొండాపురం, కపటి, సుల్తానాపురం గ్రామాల చెరువులను కేంద్ర నిధులతో అభివృద్ధి చేయాలన్నారు. చెరువుల వద్దే ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేస్తే సమీప గ్రామాల ప్రజలకు తాగునీరు అందే అవకాశం ఉందన్నారు. శాశ్వత పరిష్కారం లభించే వరకు నీటిఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు.

## టైరు ఊడి ఒరిగిన వాహనం


రోడ్డుపై నిలిచిన వాహనం

**వెల్దుర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు నుంచి డోన్‌కు కట్టెల లోడుతో వెళుతున్న వాహనం టైరు ఊడి ఒరిగిపోయింది. అల్లుగుండు పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారి-44 పై వాహనం వెనుక కుడివైపు టైరు ఊడిపోవడంతో వాహనం ఓవైపు ఒరిగి రోడ్డుపై నిలిచిపోయింది. ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. హైవే పోలీసులు చేరుకొని కట్టెలను మరో వాహనంలోకి ఎక్కించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# ప్రభుత్వ బడికి మంచి రోజులు

● మద్దికెర మండలంలో 10 మోడల్ పాఠశాలలు ● గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు బ్రేక్ ● పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య



మోడల్ పాఠశాలగా ఎంపికైన ప్రాథమిక పాఠశాల


విలీనం చేయకూడదని ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు(ఫైల్)

**మద్దికెర, మే 15 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ బడికి మంచి రోజులు వస్తున్నాయి. పాఠశాల విద్య సంస్కరణలో భాగంగా మెరుగైన వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో మార్పులు చేర్పులు చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల 3, 4, 5 తరగతులను జడ్పీ పాఠశాలలో విలీనంచేసి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఏడాది 2025-26 విద్యాసంవత్సరానికి విధి విధానాలు మారుతున్నాయి.

**పది మోడల్ ప్రాథమిక పాఠశాలలు**

మండలంలో పది ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్ది ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియం మాత్రమే బోధించనున్నారు. 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలను ఎంపిక చేసి, ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడి చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులు బోధన కొనసాగిస్తారు. మండలంలో మొత్తం జిల్లా పరిషత్ బాలుర, బాలికల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 26 ఉన్నాయి. వీటిలో మద్దికెరలో 5 పాఠశాలలు, హంపలో ఒకటి, పెరవలిలో రెండు, ఎం.అగ్రహారంలో ఒకటి, మదనంతపురంలో ఒక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా ఎంపిక చేశారు. గత వైసీపీ హయాంలో 3, 4, 5 తరగతులను జిల్లా పరిషత్ పాఠశాలల్లో విలీనం చేయవద్దంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళనలు, ధర్నాలు చేసి తరగతులు బహిష్కరించినా వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందని ఆరోపణలు ఉన్నాయి. దీని ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గి, ప్రైవేటు పాఠశాలల వైపు విద్యార్థులు పరుగులు తీశారు.

**విద్యార్థులకు మెరుగైన విద్య**



విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం మండలంలో మొత్తం 10 ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసింది. 1 నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియంలో విద్యను అందిస్తున్నాం. ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండటంతో ఈ విద్యాసంవత్సరంలో మెరుగైన విద్య అందే అవకాశం ఉంది. **- రంగస్వామి, ఎంఈవో**

## 18న కంటి వైద్యశిబిరం

**పత్తికొండ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో ఈ నెల 18న ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు బండయ్య, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న స్థానిక సాయిబాబా ఆలయం ప్రాంగణంలో మాజీ కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ రామచంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ ప్రారంభిస్తారని, విశ్వభారతి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు.

## విత్తనాలు ఇవ్వండి

**తుగ్గలి, మే 15 (ఆంధ్రజ్యోతి):** ఖరీఫ్ సాగుకు రాయితీ విత్తనాలను ఇవ్వాలని సీపీఐ మండల అధ్యక్షుడు సుల్తాన్ డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ తుగ్గలి మండలంలో ఎర్రనేల పొలాలు ఎక్కువగా ఉన్నాయని, ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, టమోట, పచ్చిమిర్చి వంటి సాగు చేస్తారన్నారు.

## పనులు కల్పించాలి

**మద్దికెర, మే 15 (ఆంధ్రజ్యోతి):** జాబ్‌కార్డు ఉన్న కూలీలందరికీ పనులు కల్పించాలని ఏపీవో నర్సిరెడ్డి సూచించారు. గురువారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. కూలీలకు రోజుకు వేతనం రూ.300 తగ్గకుండా పనులు కల్పించాలన్నారు. పనులు లేని వారికి పని కల్పించాలని, వెళ్లేలా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు చూసుకోవాలన్నారు. గ్రామంలో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

## కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

**మద్దికెర, మే 15 (ఆంధ్రజ్యోతి):** కౌలు రైతులు కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవి సూచించారు. గురువారం మండలంలోని ఎం.అగ్రహారం రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. కౌలు పత్రాలు పొందడం ద్వారా పంట నమోదు, అన్నదాత సుఖీభవ, రాయితీ విత్తనాలు, పంటల భీమా, పంట నష్టపరిహారం అందుతుందన్నారు. ప్రభుత్వం అందించే వ్యవసాయ పథకాలకు అర్హులవుతారన్నారు. కౌలు రైతుకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది తలెత్తదన్నారు. భూ యజమానులు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. వీఆర్వో స్వర్ణలత, సర్పంచ్ విజయుడు, రైతులు ఉన్నారు.

## స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

**పత్తికొండ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెస్తున్న స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉప సంహరించువాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో రామకృష్ణారెడ్డి నగర్‌లో స్మార్ట్ మీటర్లు విధానాన్ని వ్యతిరేకిస్తూ స్టిక్కర్లను అతికించి గృహ యజమానులను చైతన్యపరిచారు. గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను బిగించేందుకు పూనుకోవడం సరికాదన్నారు. దస్తగిరి, కాశన్న, రమేష్, నరసన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందించాలి

**ఆలూరు రూరల్, మే15 (ఆంధ్రజ్యోతి):** సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవ లందించాలని పత్తికొండ డీఎల్‌డీవో అనురాధ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మద్దిలేటి స్వామి, ఈవోపీఆర్‌డీవై ప్రభాకర్ ప్రంచాయితీ కార్యదర్శులు రమేష్, జిలాన్ బాషా, వెంకట నాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎల్‌డీవో అనురాధ

## సారా స్థావరాలపై దాడులు


సారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

**ఆదోని, మే15 (ఆంధ్రజ్యోతి):** పట్టణ శివార్లలోని కొండల్లో గురువారం సారా స్థావరాలపై దాడులు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. వివరాల మేరకు.. రణమండల కొండలు, సింగరాజు మల్ల కొండలు, సముద్రపు కుంట, తాయమ్మ బైలులో సారా తయారు చేస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి, 80 లీటర్ల సారాతో పాటు 6వేల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 30డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. వాల్మీకి నగర్‌కు చెందిన బోయ మురళి, బోయ ఎర్రమ్మ, బోయ నాగమ్మ, బోయ సురేష్, బోయ ఎర్రమ్మ, బోయ నాగమ్మ, బోయ సురేష్, బోయ రాజు, బోయ జలిమంచమ్మ, శుక్రవారిపేటకు చెందిన బోయ రమేష్, బోయ తిమ్మప్ప అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

## ఇరువర్గాల ఘర్షణ

**ఆదోని రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కపటి గ్రామంలో ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. వివరాల మేరకు గ్రామంలోని రహదారి విషయంలో బుధవారం రాత్రి ఇరు వర్గాల వారు రాళ్లు, కట్టెలతో దాడిచేసుకున్నారు. ఓ వర్గం మహిళలు గాయపడగా, వారిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెఎస్.ఐ నాయక్ తెలిపారు.

## బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి

**క్రిష్ణగిరి, మే 15(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. గురువారం కటారుకొండ గ్రామంలో నక్కి రామన్న 35వ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. బడుగుల అభ్యున్నతికి నక్కి రామన్న కృషి చేశారన్నారు. ఖలీల్ బాషా, వెంకట్రాముడు,చిన్న మాదులు, దయ్యాల లక్ష్మన్న, కోరి బజారి, క్రిష్టయ్య, నక్కి పుల్లయ్య, రామన బోయన రామాంజనేయులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల పర్యవేక్షణ

**ఆదోని టౌన్ , మే15 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో చేస్తున్న పారిశుధ్య పనులను మునిసిపల్ చైర్మన్ ముల్లాగౌస్ గురువారం పర్యవేక్షించారు. ఈనెల 19వ తేదీన జరగనున్న లక్ష్మమ్మ జాతర సందర్భంగా షరాఫ్ బజార్‌తో పాటు., టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కాలువలోని పూడికను తొలగించారు. చైర్మన్ క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును పరిశీలించారు.

## రుణాలు చెల్లించాలి

**హాలహర్వి, మే15 (ఆంధ్రజ్యోతి):** రుణాలు తీసుకున్న పొదుపు మహిళలు సకాలంలో చెల్లించాలని వెలుగు ఏపీఎం శివయ్య సూచించారు. గురువారం కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తీసుకున్న రుణంతో స్వయం ఉపాధి పొందాలని కోరారు.

## కార్యదర్శిని నియమించాలి

**వెల్దుర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి):** మేజర్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని సీపీఐ కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఇన్‌చార్జి కార్యదర్శితో పనులు కావడం లేదని, సమస్యలు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయన్నారు.

## ప్రజా చైతన్యమే కళాకారుల కర్తవ్యం

**ఆదోని రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి):** ప్రజలను చైతన్యపరచడమే కళాకారుల కర్తవ్యమని సీపీఐ ఎ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్యలు అన్నారు. గురువారం స్థానిక విశ్వనారాయణ కాలేజీలో ప్రజా నాట్యమండలి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. నాగరాజు, వెంకట్రాముడు, సత్య నారాయణ, కోడుమూరు కృష్ణ, అజయ్ బాబు, సుదర్శన్, కల్లుబావి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మద్దికెరలో వర్షం

**మద్దికెర, మే 15 (ఆంధ్రజ్యోతి):** మండలంలో గురువారం తెల్లవారుజామున 12.మి.మీ.ల వర్షం కురిసిందని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ తెలిపారు. వాతావరణ శాఖ సూచన మేరకు ఈ ఏడాది అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## తాగునీటికి రూ.529 కోట్లు మంజూరు

● ఎమ్మెల్యే పార్థసారథి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

**ఆదోని టౌన్ , మే15 (ఆంధ్రజ్యోతి):** ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కింద రూ.592 కోట్లు మంజూరు చేసిందిన ఎమ్మెల్యే డా.పార్థసారథి అన్నారు. గురువారం కూటమి నాయకుల సమక్షంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో తాను కేంద్ర మంత్రులకు తాగునీటి ఇబ్బందులను వివరించి, వినతిపత్రాలను ఇచ్చిన ఫలితంగా ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేశారన్నారు. పెద్దతుంబలం, జె.హోసళ్లి, రంగాపురం, అరేకల్ రాజా నగర్ ప్రాంతాలలోని కొండలపై ట్యాంకులను నిర్మించి, 163 గ్రామాలకు తాగునీరు ఇస్తామన్నారు. 2055 వరకు ఉండే జనాభాను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టులకు రూపకల్పన చేవామన్నారు. ఇప్పటికే గుజరాత్‌కు చెందిన టీమ్ సర్వే పనులను ప్రారంభిందని, రెండే ళ్లల్లో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామ ని తెలిపారు. అసెంబ్లీలో నీటి సమస్యల పై తాను మాట్లాడినప్పుడు, కేంద్ర మం త్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చినప్పు డు చాలామంది హేళన చేసారని వాటిని తాను పట్టించుకోలేదన్నారు. సమావే శంలో బీజేపీ నాయకులు విట్టా రమేష్, మరియాని చెన్న బసప్ప, టీడీపీ నాయకులు భూపాల్, గుడిసె కృష్ణమ్మ, శ్రీకాంత్ రెడ్డి, జనసేన నాయకులు రేణువర్మ, పులిరాజు పాల్గొన్నారు.

## పట్టాల మంజూరుకు స్థలం పరిశీలన

**ఆస్పరి, మే15 (ఆంధ్రజ్యోతి):** మండలం లోని డి.కోటకొండ గ్రామంలో ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు గురువారం ఆర్‌డీవో భరత్‌నాయక్, తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి స్థలాలను పరిశీలించారు. 10 ఏళ్ల కిందట దరఖాస్తు చేసుకున్న వారికి జీవో 30 నెంబర్ ప్రకారం పట్టాల మంజూరు చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆర్‌డీవో తెలిపారు. త్వరలో లబ్దిదారల పేరిట ఇళ్ల పట్టాలు మంజూరు చేసి పంపిణీ చేస్తామని ఆర్‌డీవో తెలిపారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

## న్యాయవాది మృతి

**పత్తికొండ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి):** పట్టణానికి చెందిన న్యాయవాది ఈరన్న (65) గురువారం మృతి చెందారడు. ఈరన్న పత్తికొండ కోర్టులో కేసులు వాదిస్తున్నారు. న్యాయవాదులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఈరన్న (ఫైల్)

## కంచె ఏర్పాటు చేయాలి

**ఆలూరు రూరల్, మే15 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కురకుంద గ్రామం సచివాలయ సమీపంలోని రహదారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మూగజీవాలు, పిల్లలు పొరపాటున ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలితే ప్రాణాపాయం సంభవిస్తుందని రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కురకుంద గ్రామంలో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్

# ఆసుపత్రి ప్రారంభానికి బ్రేక్

● అధికార పార్టీ నాయకులకు సమాచారం ఇవ్వని అధికారులు
● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్
● ఆలూరులో పూర్తయిన నూతన భవనం



ఆలూరులో సిద్ధమైన ఆసుపత్రి నూతన భవనం

**ఆలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో నాబార్డు నిధులు రూ.1.70 కోట్లతో నిర్మిచిన ఆసుపత్రి నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. సోమవారం ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిని ఇంజనీరింగ్ అధికారులు ఆహ్వానించారు. అధికార పార్టీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్‌కు కనీస సమాచారం ఇవ్వలేదు. మరోవైపు ఆసుపత్రిని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వైసీపీ నాయకులు ప్రచారం చేస్తుండటంతో టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వీరభద్రగౌడ్**

ఆసుపత్రిని మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు చేతులమీదుగా ప్రారంభించాలని అనుకున్నామని, మరి ఇప్పుడు ఎమ్మెల్యే చేత ఎలా ప్రారంభిస్తారని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ కలెక్టర్ రంజిత్ బాషాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆసుపత్రి ప్రారంభాన్ని తాత్కాలికంగా ఆపేయాలని వైద్యశాఖ అధికారుల నుంచి సూపరింటెండెంట్ వహీద్‌కు ఫోన్‌లు రావడంతో ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడింది. మరోవైపు అధికార, ప్రతిపక్ష నాయకుల వైఖరితో ప్రారంభం నిలిచిపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయంపై ఆసుపత్రి వైద్యుడు వహీద్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా వాయిదావేస్తున్నట్లు తెలిపారు.

# ఎండుతున్న బోరుబావులు

**● బావులు, బోర్లలో అడుగంటిన జలాలు ● ఖరీఫ్ ప్రారంభంలోనే సాగుకు నీరు అందని వైనం ● హంద్రీ నది పరిసర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి**



హంద్రీలో నీరు లేకపోవడంతో నిరుపయోగంగా మారిన బోరు

**గోనెగండ్ల, మే 15(ఆంధ్రజ్యోతి):** వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటగానే ప్రజలు బయటికి రాలేని పరిస్థితి. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాలలో 39 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు అవుతోంది. ఇక పంట పొలాల్లో వేడి మరీ ఎక్కువ. ఏడాదిగా వర్షాలు సకాలంలో పడకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. బావులు, బోర్లు, చెరువులు, కుంటల్లో చుక్కనీరు ఉండటంలేదు. మునుపు 'చైత్రమాసంలో చెడువానలు' అంటూ అడపాదడపా వర్షాలు కురిసేవి అయితే ఈ ఏడాది వైశాఖ మాసం పూర్తయినా పంట సాగుకు పనికి వచ్చే వర్షపు జాడనే కనిపించడం లేదు. ఎమ్మిగనూరు డివిజన్‌లో ఉగాది పోగానే పొలాల్లో పత్తి, వేరుశనగ, తదితర పంటలను సాగు చేసేవారు. అయితే ఈ ఏడాది అరకొర వర్షాలు, ఎండలు మండిపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. దీంతో బావులు, బోర్లులో నీరు లేని కారణంగా ముందస్తు పంటలు సాగు చేసేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి ఏడాది ఈ పాటికే బావులు బోర్లు దగ్గర మిరప, ఉల్లి, పత్తి, వేరుశనగ పంటలను సాగు చేసేవారు. అయితే ఈ ఏడాది ఇంత వరకు బావులు బోర్ల దగ్గర చెప్పుకోదగ్గ స్థాయిలో పంటలు సాగు కాలేదు.

### బావులు, బోర్ల కింద పదివేల ఎకరాల్లో సాగు

ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలలో చైత్రమాసం



బావిలో అడుగంటిన నీరు

చివరి కంతా బావులు, బోర్ల కింద పంటలు సాగు చేసేవారు. వైశాఖ మాసంలో అవి మొలకెత్తేవి, అయితే ఈ ఏడాది జాడనే కనిపించడం లేదు. బోర్లు, బావుల కింద మిరప, ఉల్లి, వేరుశనగ పంటలు దాదాపు పదివేల ఎకరాల పైగానే సాగు చేసేవారు. అయితే ఈ ఏడాది బావులు, బోర్లలో నీరు లేని కారణంగా పంటలు సాగు చేయడం లేదు. గోనెగండ్ల, నందవరం మండలాలలో అక్కడక్కడ వేరుశనగ, పత్తి పంటలను సాగు చేస్తున్నారు. చాల గ్రామాలలో పొలాలను వర్షం కురిసే వరకు పంటనుసాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

### అడుగంటిన భూగర్భజలాలు

ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలలో దాదాపు వెయ్యి బావులు, మూడు వేల బోర్లు అడుగంటి పోయాయి. రైతులు అనాలోచితంగా ఎక్కడ పడితే అక్కడ బోర్లు వేయడంతో, వర్షాలు సకాలంలో కురవక భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి, వేముగోడు, చిన్ననేలటూరు, పెద్దమరివీడు, కులుమాల, అలువాల, గాజులదిన్నె, తిప్పనూరు, నందవరం మండలంలో ముగతి, నాగలదిన్నె, మిట్టసోమాపురం, గురుజాల, పూలచింత, ధర్మాపురం, హలహర్వి గ్రామాలలో బావులు, బోర్లు ఎక్కువగా ఉన్నాయి. నీరు లేని కారణంగా పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

### హంద్రీ నదిలో అడుగంటిన నీరు

మండుతున్న ఎండలకు గాజులదిన్నె ప్రాజెక్టు హంద్రీ నదిలో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. ఈ కారణంగా హంద్రీలో వేసిన బోర్లు, బావుల నీటితో పంటలు పండించుకునే రైతులకు నీరు అడుగంటి పోవడంతో పరిసర గ్రామాల రైతులు సాగు ప్రయత్నాలు చేయడం లేదు. గాజులదిన్నె, హెచ్‌కైరవాడి, వేముగోడు, పిల్లిగుండ్ల, తిప్పనూరు, బోదేపాడు, వీరంపల్లి, పుట్టపాశం, గ్రామాల రైతులు హంద్రీ నీటితో పంటలు పండించుకుంటారు. ఈ గ్రామాల్లో దాదాపు 1000 ఎకరాల పైగానే హంద్రీనీటితో పంటలు సాగుచేసుకుంటారు. నీటి సమస్యతో ఈఏడాది హంద్రీ గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు కూడా వస్తాయని గ్రామస్థులు తెలుపుతున్నారు.

### నాలుగు బోర్లు ఎండిపోయాయి



తనకు ఉన్న నాలుగు ఎకరాల్లో వేసిన బోర్లు ఎండిపోయాయి. వర్షాకా లంలో బోర్లలో నీరు బాగానే ఉండేది. ఎండలు మండిపో యే కొద్ది బోర్లలో నీరు అడుగంటి పోయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు పంటలు సాగు చేయలేదు.

**- జయరాముడు, పిల్లిగుండ్ల**

### వర్షాలు కురిస్తేనే పంటలకు నీరు



ఈ నెలాఖరులో వర్షాలు కురిసి బావులు, బోర్ల కు నీరు వస్తే కానీ అప్పటి వరకు పంటలు సాగు చేయలేం. బావులు, బోర్లలో నీరు అడుగంటి పోయింది. ఏడాది కిందట ఈ పాటికి బావుల కింద మిరప సాగు చేసేవాళ్లం. ఈ ఏడాది ఇప్పటి వరకు పొలం పనులను ప్రారంభించలేదు.

**ఉరుకుందరెడ్డి, రైతు, వేముగోడు**

## భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్, సర్వేయర్లు

**మంత్రాలయం, మే 15 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పనులను తహసీల్దార్ ఎస్.రవి, మండల సర్వేయర్ అశోక్ తనిఖీ చేసి కల్లుదేవకుంట, మంత్రాలయం, చెట్నహళ్లి భూముల్లో కట్టడాలు పరిశీలించారు. దాదాపు 27.45 ఎకరాలు హైవే రోడ్డుకు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే నిధులు మంజూరవడంతో హైవే, బైపాస్ టెండర్లుకు పిలువనున్నారు. లైనింగ్ పనులు పూర్తయితే ట్రాఫిక్ తగ్గుతుందని, భారీ వాహనాలు మంత్రాలయంలోకి రాకుండా మాధవరం నుంచి ఎమ్మిగనూరు, కర్నూలు, ఆదోని బైపాస్ మార్గాన వెళ్తాయని తెలిపారు. పరిశీలనలో చెట్నహళ్లి సర్వేయర్ నవీన్ కుమార్, వీఆర్వో భీముడు, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి




కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

**పెద్దకడుబూరు, మే 15(ఆంధ్రజ్యోతి):** ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు తిక్కన్న, పరమేష్ కోరారు. గురువారం సమ్మె కరపత్రాలను మండల కేంద్రమైన పెద్దకడుబూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్‌ను తెచ్చిందన్నారు. వీటిని రద్దు చేసి కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, నాగరాజు, గోవిందమ్మ పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

**ఎమ్మిగనూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి):** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె తాత్కలికంగా రెండు రోజులు విరమించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికుల అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ కమిషనర్ గంగిరెడ్డి ఇంజనీరింగ్ కార్మికులతో చర్చలు జరిపి మే 17న ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కర్నూలు జిల్లా పర్యటన ఉన్నందున సమ్మె విరమించాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికుల రాష్ట్ర నాయకుల సూచనలతో రెండు రోజులు సమ్మెను తాత్కలికంగా విరమిస్తున్నట్లు కార్మికులు తెలిపారు.

## 'ఆ చట్టాలను రద్దు చేయాలి'

**మంత్రాలయం, మే 15 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నూతన చట్టాలు కార్మికుల పొట్ట కొడుతున్నాయని, వెంటనే ఆ చట్టాలను రద్దు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో చాలా మంది కార్మికులు అర్ధాకలితో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న జరగబోయే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి దస్తగిరి, సహాయ కార్యదర్శి వీరేష్, సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, సీపీఐ మండల నాయకులు గాబ్రియేలు, కుబేర్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



కృష్ణయ్యకు నగదును అందజేస్తున్న స్నేహితులు

**ఎమ్మిగనూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) :** అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణయ్యకు పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని స్థానిక 18వ వార్డుకు చెందిన కృష్ణయ్య అంబేడ్కర్ సర్కిల్‌లో చిన్న దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తూ అనుకొకుండా అనారోగ్యం బారిన పడడంతో జీవితం ఒక్కసారిగా కకావికలమయింది. కృష్ణయ్యకు ఒక కుమారుడు, ఒక కూతురు భార్య ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడి గురించి తెలుసుకున్న పూర్వవిద్యార్థులు మృత్యుంజయ, భీమన్న, ఉసేని, విజయ్, బవరాజులు ఇంటికి వెళ్లి బాగోగులు తెలుసుకొని స్నేహితులు మనోధైర్యం చెప్పారు. అనంతరం రూ.22 వేలు ఆర్థిక సాయం అందించారు. కృష్ణయ్య మాట్లాడుతూ స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

## గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ

**గోనెగండ్ల, మే 15(ఆంధ్రజ్యోతి):** నిధులు అందక నిలిచిపోయిన గృహాలకు ప్రస్తుతప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది కాబట్టి త్వరగా పెండింగ్‌లో ఉన్న గృహాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో మణిమం జరి, హౌసింగ్ ఏఈ షేక్షావలి కోరారు. గురువారం మండల పరిధిలోని అయ్యకొండ గ్రామంలో ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ పర్యటించారు. హౌసింగ్ స్కీం కింద మంజూరై సగంలో నిలిచి పోయిన ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అదనపు నిధులను విడుదల చేస్తుంది. ఇండ్ల నిర్మాణ పనులకు వెంటనే పూర్తి చేసుకోవాలని కోరారు.

## నాణ్యమైన భోజనాన్ని అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

**ఎమ్మిగనూరు, మే 15(ఆంధ్రజ్యోతి):** అన్నా క్యాంటీన్లలో నిబంధనల మేరకు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని అన్నా క్యాంటీన్లలో భోజనాన్ని పరిశీలించారు. అలాగే భోజనం చేసేందుకు వచ్చిన వారినుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీగా మెనూ ప్రకారం టిఫిన్, భోజనాన్ని అన్నా క్యాంటీన్లకు వచ్చే వారికి అందజేయాలన్నారు. అంతకు ముందు పట్టణంలోని షరాఫ్ బజార్, తేరుబజారు, మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అలాగే పట్టణంలోని పార్కురోడ్డులో విద్యుత్ స్తంభాలు మార్పు చేసే విషయంపై విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు.

## పేదల అభ్యున్నతి కోసమే ఆర్డీటీ సేవలు



రాంపురంలో మాట్లాడుతున్న ఆర్‌డీటీ రీజనల్ డైరెక్టర్ సరస్వతి

**మంత్రాలయం, మే 15(ఆంధ్రజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుపేద కుటుంబాల అభ్యున్నతి కోసమే ఆర్డీటీ సేవలు అందిస్తుందని ఆర్‌డీటీ రీజనల్ డైరెక్టర్ సరస్వతి అన్నారు. మండలంలోని రాంపురం, బసాపురం గ్రామాల్లో ఆర్డీటీ ఏరియా టీం లీడర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఆర్‌డీటీ ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సంస్థ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ద్వారా జీవననైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మంత్రాలయం సీఈఓ నరసింహులు, ఆర్డీటీ లీడర్లు భాస్కర్, ఆదాము, సంవృద్ధి, పురుషోత్తం, చిన్న, యోహాను,, దామస్, రాజేశ్వరి, సుమిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయం




రాజు భార్యకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

**ఎమ్మిగనూరు రూరల్, మే15(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంకులో పనిచేస్తూ మృతి చెందిన రాజు కుటుంబాన్ని పెట్రోల్ బంకు యాజమాన్యం ఆదుకోవడం అభినందనీయమని సీపీఐ పట్టణ కార్యద ర్శి రంగన్న, జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్ అన్నారు. గురువారం మృతుడి భార్య మంజులకు రూ.4లక్షల చెక్కును పెట్రోల్ బంకు యజమాన్యంతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునగౌడు, మేనేజర్ ఈరన్న, జయరాం, విశ్వనాథ్, మల్లికార్జునగౌడు, నరసింహ, మాజీ కౌన్సిలర్ మధుబాబు పాల్గొన్నారు.

## గడ్డి విత్తనాల పంపిణీ



గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**గోనెగండ్ల, మే 15(ఆంధ్రజ్యోతి):** రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ కింద గ్రాసం అందజేస్తున్నట్లు పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లకు 72 గ్రాసం బ్యాగ్‌లు వచ్చాయన్నారు. ఒక్కొక్క బ్యాగ్‌లో 50 కేజిల గ్రాసం ఉంటుందన్నారు. ఒక బ్యాగ్ ధర రూ. 1150 కాగా రైతులకు 50శాతం సబ్సిడీ కింద అందజేస్తున్నామని తెలిపారు. గోనెగండ్లకు 40 బ్యాగ్‌లు, ఐరన్‌బండ, గంజహళ్లి, అగ్రహారం, బైలుప్పల గ్రామాలకు 8 బ్యాగ్‌ల చొప్పున అందజేస్తున్నమని మిగిలిన గ్రామాలకు త్వరలో గ్రాసం బ్యాగ్‌లను అందజేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొంత మంది రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హైమావతి, టీడీపీ నాయకులు బేతాలబడేసా, రంగస్వామినాయుడు, అడ్వకేట్ చంద్రశేఖర్, నూరహ మ్మద్, శ్రీధర్, మాబువలి వ్యసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


## అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

**కౌతాళం, మే 15(ఆంధ్రజ్యోతి):** మండలంలో ఉన్న తుంగభద్ర దిగువ కాలువ కింద ఉన్న డీపీ 65 నెంబరు కాలువ మరమ్మతు పనులకు టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బదినేహాల్ పంట కాలువ పూర్తిగా దెబ్బతినడంతో నీరు ముందుకు ప్రవహించక పంటలకు నీరు సరిగా అందేదికాదని దీంతో ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం ఈ పంట కాలువల మరమ్మతు పనులకు రూ.1.92 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎల్‌సీ టీబీ ప్రాజెక్టు అధ్యక్షుడు టిప్పుసుల్తాన్ మండల టీడీపీ నాయకులు సురేష్ నాయుడు, వెంకటపతిరాజు, అడివప్పగౌడ్, రజానందు, సతీష్ నాయుడు, కుంటనహల్ మారెప్ప, రైతులు పాల్గొన్నారు.

## విశ్రాంత మండల వ్యవసాయాధికారి మృతి



ఫక్రుద్దీన్ (ఫైల్)

**మంత్రాలయం, మే 15 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం మండలంలో వ్యవసా యాధికారిగా, ఇన్‌చార్జి ఎంపీడీవోగా 15 ఏళ్లు పని చేసి ఎన్నో గ్రామాల రైతులకు విశేష సేవలందించిన ఫక్రుద్దీన్ (88) గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, మండల కన్వీనర్ భీమిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథ్ రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. వీరితోపాటు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీటీడీ మాజీ సభ్యులు సీతారామిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, మాలపల్లి సత్యనారాయణరెడ్డి, మంత్రాలయం మండల టీడీపీ కన్వీనర్ వెంకటేశ్ స్వామి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, మండల స్థాయి అధికారులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**ఎమ్మిగనూరు, మే 15(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని నాలుగో వార్డులో విద్యుత్ సరఫరాలో నిత్యం సమస్యలు తలెత్తడంతో వార్డు టీడీపీ కౌన్సిలర్ రామదాసు గౌడ్ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో గురువారం విద్యుత్‌శాఖ అధికారులు దీంతో వార్డులో లోటల్టేజీ, హైటల్టేజీ సమస్య తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయటంతో వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు కృత జ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రామదాసు గౌడ్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొండ, బుడ్డప్ప, శేఖర్ గౌడ్, నాగరాజు, మహబూబ్ బాషాలు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి




మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి

**ఎమ్మిగనూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) :** మే 20వ తేదీన కార్మికులు నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎషేపు అన్నారు. ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలు లేబర్ కోడ్‌లు వస్తే కార్మికులు బానిసలుగా మారే అవకాశం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు చిన్న రామలింగ, జయన్న, సర్రన్న తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం పరిసరాలు

**మంత్రాలయం, మే 15 (ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. స్వామికి గురువారం ఇష్టమైన రోజు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు రావడంతో ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, ఆర్‌టీసీ బస్టాండు, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. క్యూలైన్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది..

### గోశాలకు 28 ట్రాక్టర్ల పశుగ్రాసం విరాళం

శ్రీమఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు రాయచూరు జిల్లా, శిరువార, సింధనూరు, చాగబావి గ్రామాలకు చెందిన రైతులు దాదాపు రూ.3 లక్షలు విలువ చేసే 28 ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్‌లు తెలిపారు. విరాళం ఇచ్చిన రైతులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం,ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ అనంతపురాణిక్, గోశాల సూపర్‌వైజర్ నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్‌లు పాల్గొన్నారు.